ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 23 జనవరి 2024



శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సంబరం... జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు

జై శ్రీరామ్



నగర సంకీర్తన నిర్వహిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్యులు



అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక సందర్భంగా జిల్లావ్యాప్తంగా సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రీరామ నవమి ముందుగానే వచ్చిందా అనిపించేలా సీతారామ, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు సందడి చేశారు. ఇళ్ల ముందు కల్లాపిజల్లి.. రంగు రంగుల ముగ్గులు వేశారు. ఆబాల గోపాలం శ్రీరామనామాన్ని జపించింది. పల్లెలు, పట్టణాల్లో కపిరాజు బొమ్మ ఉన్న కాషాయ జెండాలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నప్రసాదాలను వడ్డించారు. ఆలయాలు, మఠాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అయోధ్యలో జరుగుతున్న వేడుకలను టీవీలలో చూసి ఆనందపరవశులయ్యారు. జై శ్రీరామ్ నినాదాలు మర్మోగాయి.



బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురంలో సీతారాములు, ఆంజనేయుడికి ప్రత్యేక అలంకరణ



కసాపురంలో సీతారామలక్ష్మణసమేత ఆంజనేయస్వామివారికి ప్రత్యేక అలంకరణ



నగరంలో బెస్త సేవాసంఘం నాయకుల బైక్ ర్యాలీ



రామగిరిలో అన్నప్రసాదాన్ని పంచుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

పరిటాల రవీంద్ర వర్ధంతికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ నాయకులు

రామగిరి, జనవరి 22: మాజీ మంత్రి, దివంగత పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి 24వ తేదీన జరగనుంది. వర్ధంతి ఏర్పాట్లను మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కుటుంబ సభ్యులు, స్థానికనేతలతో కలిసి సోమవారం పరిశీలించారు. పరిటాల రవీంద్ర వర్ధంతికి అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఏడాది కూడా వేలసంఖ్యలో తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో తరలివస్తారన్న సమాచారం అందడంతో ముందస్తుగా భారీ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే తాగునీటి కొళాయిల మరమ్మతులు, వంట సామగ్రిని సిద్ధం చేయించడం, భోజనశాల ఏర్పాట్లను పరిశీలించారు. ఆమెవెంట టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, ధర్మవరపు బాలాజీ, రామ్మూర్తినాయుడు ఉన్నారు.

అక్కడికి వెళ్లొద్దు..!

అనంతపురం విద్య, జనవరి 22: సీఎం జగన్ జిల్లా పర్యటన నేపథ్యంలో విపక్ష నాయకులను పోలీసులు ముందుగానే కట్టడి చేస్తున్నారు. టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుంజయనాయుడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పోలీసులు సోమవారం నోటీసులు ఇచ్చారు. సీఎం టూర్‌కు వెళ్లకుండా పలువురిని హౌస్ అరెస్టు చేస్తున్నారు. సీఎం టూర్‌ను అడ్డుకుంటామని ప్రకటించిన వామపక్ష నాయకులు పలువురు వివిధ మార్గాల్లో ఉరవకొండకు వెళ్లారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ బురఖా ధరించి ఉరవకొండకు వెళ్లారు.





టీఎన్ఎస్ఎఫ్, రైతు సంఘం నాయకులకు నోటీసులు ఇస్తున్న పోలీసులు



బురఖా ధరించి ఉరవకొండకు వెళ్లిన జాఫర్

హామీలు గుర్తున్నాయా జగనన్నా..?

- పాలన ముగుస్తోంది.. పట్టించుకోనేలేదు..!
- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఊసేలేదు
- కార్పొరేషన్లకు పైసా ఇచ్చిందీ లేదు
- పరిశ్రమలు.. ఉద్యోగాలు ఉత్తిమాటలేనా..?
- సీఎం జగన్‌కు జిల్లా ప్రజల సూటి ప్రశ్నలు



అనంతపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వస్తే అభివృద్ధిలో అనంతను అగ్రగామిగా నిలుపుతానంటివి. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తానంటివి. కొత్త రిజర్వాయర్లను నిర్మిస్తానంటివి. కరువు నేలలో ప్రతి ఎకరాకు సాగునీరిస్తానంటివి. పరిశ్రమలు తీసుకొస్తానంటివి. వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తానంటివి. హెచ్చెల్సీని ఆధునికీకరించి, హంద్రీనీవాను పూర్తిచేసి.. లక్ష ఎకరాలకు సాగునీరిస్తానంటివి. హంద్రీనీవా కాలువను విస్తరించడంతో పాటు సమాంతర కాలువను తవ్వి.. ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచుతానని ఆర్భాటంగా ప్రకటిస్తివి. కానీ ఐదేళ్లు గడుస్తున్నా ఏవీ చేయకపోతివి. కరువు జిల్లా అభివృద్ధికి ఏం చేశావో బదులివ్వగలవా జగనన్నా..?' అనీ సీఎం జగన్‌ను జిల్లా ప్రజానీకం నిలదీస్తోంది. హామీలను ఎందుకు అమలు చేయలేదో ఉరవకొండలో మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో సెలవివ్వాలని కోరుతోంది. బటన్ నొక్కుడు తప్ప.. ఏనాడైనా అభివృద్ధి పనులను ప్రారంభించారా..? అలాంటి పనిమీద జిల్లాకు ఎప్పుడైనా వచ్చారా..? అని ప్రశ్నిస్తోంది.

జలదీక్ష హామీ గుర్తుందా..?

2017 ఫిబ్రవరి 6 గుర్తుందా..? ఉరవకొండలో ప్రతిపక్ష నేత హోదాలో జలదీక్ష పేరిట మహాధర్నా నిర్వహించావు. చంద్రబాబును మరో పేరుతో దుర్భాషలాడావు. ఉరవకొండ నియోజకవర్గానికి హంద్రీనీవా నీరివ్వాలని అప్పటి ప్రభుత్వాన్ని నిలదీశావు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేస్తే 1.18 లక్షల ఎకరాలకు నీరివ్వొచ్చని అన్నావు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఆ పని చేసి చూపిస్తానని గొప్పలు చెప్పావు. పాలన ముగుస్తున్నా ఆ హామీకి అతీగతీ లేదు. ఇది రైతులను మోసం చేయడం కాదా..?

సమస్యలు తీరినట్టేనా..?

ఐదేళ్లలో కరువు రైతును ఏ విధంగా ఆదుకున్నావో చెప్పగలవా జగనన్నా..? కేంద్రం సాయంతో కలిపి ఇచ్చే రైతు భరోసా సొమ్ముతోనే రైతు సమస్యలన్నీ తీరినట్లేనా..? గత ప్రభుత్వం యాంత్రీకరణ పేరుతో వ్యవసాయ పరికరాలిచ్చింది. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేసింది. పంటనష్ట పరిహారం ఇచ్చింది. పంటల బీమా ఇచ్చింది. అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం జరిగితే.. క్షేత్రస్థాయికి వచ్చి గత పాలకులు ధైర్యం చెప్పారు. ఏనాడైనా మీరు ఆ పని చేశారా..? డ్రిప్పు, స్ప్రింక్లర్లపై సబ్సిడీని ఎత్తేశారు. పెండింగ్ ప్రాజెక్టులను పట్టించుకోలేదు. రిజర్వాయర్ల నిర్మాణం అంటివి. గంపెడు మట్టి తీయకపోతివి. నమ్మి ఓటేసినందుకు రైతు రుణం తీర్చుకునేది ఇలాగేనా..? వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దడమంటే ఇదేనా..?

ఇదేం తీరు..?

నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటున్నారేగాని, వారికి ఏం లబ్ధి చేకూర్చారు..? ఒక్కో సామాజికవర్గానికి ఒక్కో కార్పొరేషన్ అంటివి. వాటికి పైసా నిధులిచ్చా రా..? ఒక్కరికైనా సబ్సిడీ రుణాలిచ్చా రా..? కులవృత్తులవారికి పరికరాలు ఇచ్చారా..? గత ప్రభుత్వంలో కార్లు ఇచ్చారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు ఇచ్చారు. యంత్ర పరికరాలు ఇచ్చారు. మీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లన్నీ అ లంకారప్రాయమే కదా..? నవరత్నాల దరఖాస్తు లు పరిశీలనకే కార్పొరేషన్లు పరిమితమయ్యాయి. ఇదేనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి..?

ప్రాజెక్టులు ఏమయ్యాయి..?

రెండుమూడు నెలల్లో మీ పాలన పూర్తవుతుంది. ఇప్పటి వరకూ సాగునీటి ప్రాజెక్టులు కదిలాయా..? రిజర్వాయర్లు, చెక్‌డ్యాంలు, చెరువులపై శ్రద్ధ పెట్టుంటే.. 50 టీఎంసీల నీరైనా నిల్వ చేసుకునే వెసులుబాటు కలిగేది. నిర్లక్ష్యం చేశారు. హంద్రీనీవాకు నిర్వహణ నిధులతో సరిపెడితిరి. హెచ్ఎల్సీ ఆధునికీకరణ అతీగతీ లేదు. భైరవానితిప్పకు రూ.200 కోట్లు ఇస్తామని కళ్యాణదుర్గంలో ప్రకటిస్తిరి. ఆ తరువాత ఊసే ఎత్తకపోతివి. పేరూరు, ఉంతకల్లు, నేమకల్లు.. ఏవీ కార్యరూపం దాల్చలేదు. రాప్తాడు నియోజకవర్గంలో మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఒక్కదానికైనా.. ఒక్క ఇటుకైనా వేశారా..?

నేడు ఉరవకొండకు సీఎం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉరవకొండకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30కు ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 10.40 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. ఆ తరువాత వాహనంలో సభావేదికకు చేరుకుంటారు. 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసే సభను నిర్వహిస్తారు. అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకొని స్థానిక నాయకులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి 2.20 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 3.15 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.

సీఎం సభ కోసం బడులకు సెలవా..?

- మాజీ మంత్రి కాలవ

వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. ఉరవకొండ బహిరంగ సభకు జనసమీకరణ కోసం బలవంతంగా ప్రైవేట్ స్కూల్ బస్సులను లాక్కుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి సభకు జనాలను తరలించేందుకు ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థలకు బలవంతంగా సెలవివ్వాలని అధికారులపై ఒత్తిడి చేయడం దారుణమని అన్నారు. బడి బస్సులను ఉపాధి హామీ సిబ్బందికి అప్పగించాలని ఆర్టీఏ అధికారులు హుకుం జారీ చేశారని అన్నారు. సంక్రాంతికి ఎక్కువ సెలవులు ఇవ్వడంతో ఇప్పటికే పనిదినాలు తగ్గిపోయాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. సీఎం సభ కోసం మరో రోజు బలవంతపు సెలవు ఇస్తారా అని మండిపడ్డారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం 50 మందిని తరలించాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు టార్గెట్ పెట్టడం దుర్మార్గమని అన్నారు.

మహిళలే ఎక్కువ..!

- జిల్లా ఓటర్ల తుది జాబితా విడుదల
- ఎనిమిది నియోజకవర్గాల్లో 19,94,544

పురుషులు 9,88,176

మహిళలు 10,06,123



- జిల్లా వ్యాప్తంగా పెరిగిన ఓటర్లు 16,884 మంది
- కళ్యాణదుర్గంలో మునుపటికంటే 691 తక్కువ
- అసత్య సమాచారం ఇచ్చిన నలుగురిపై కేసులు
- మరో ఇద్దరిపై ఫిర్యాదు: కలెక్టర్ గౌతమి



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, జనవరి 22: యుద్ధం ముగిసింది..! తుది జాబితా వచ్చేసింది. ఇక ఇందులో ఏమేం ఉన్నాయో.. ఏమేం ఎగిరిపోయాయో వెతికే పనిలో పడ్డాయి అధికార వైసీపీ, విపక్ష తెలుగుదేశం. మునుపెన్నడూ లేనన్ని వివాదాల నడుమ ఓటరు తుది జాబితా తయారైంది. దాదాపు మూడునెలల పాటు జిల్లా అధికార యంత్రాంగం ఈ పనిలో నిమగ్నమైంది. ముసాయిదా విడుదల కాగానే డబుల్ ఓటర్లు, నకిలీలను టీడీపీ ఎత్తి చూపింది. తొలగింపులకు జరిగిన కుట్రలనూ బయట పెట్టింది. ఈ అక్రమాలను ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకోవడంతో కొందరు అధికారులు, ఉద్యోగులు బలయ్యారు. యుద్ధాన్ని తలపించిన ఈ ప్రక్రియ ముగిసి.. సోమవారం తుది జాబితా బయటకు వచ్చింది. రెవెన్యూ భవన్‌లో కలెక్టరు గౌతమి అధికారికంగా ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 19,94,544 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఈ జాబితాలో మహిళలదే ఆధిక్యం. పురుష ఓటర్లు 9,88,176 మంది ఉండగా, మహిళా ఓటర్లు 10,06,123 మంది ఉన్నారు. థర్డ్ జెండర్స్ 245 మంది ఉన్నారు. అత్యధికంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2,78,475 మంది ఓటర్లు ఉన్నారు. అత్యల్పంగా ఉరవకొండ నియోజకవర్గంలో 2,22,723 మంది ఓటర్లు ఉన్నారు. అన్ని

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్
రాయదుర్గం	2,60,859	1,29,090	1,31,736	33
ఉరవకొండ	2,22,723	1,09,905	1,12,788	30
గుంతకల్	2,67,036	1,31,304	1,35,656	76
తాడిపత్రి	2,44,075	1,21,499	1,22,552	24
శిగనమల	2,45,625	1,22,341	1,23,257	27
అనంతపురం అర్బన్	2,78,475	1,36,761	1,41,679	35
కళ్యాణదుర్గం	2,27,438	1,13,195	1,14,236	07
రాప్తాడు	2,48,313	1,24,081	1,24,219	13

నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం.

కళ్యాణదుర్గం మినహా..

జిల్లా వ్యాప్తంగా ఓటర్ల సంఖ్య పెరిగింది. గత ఏడాది జాబితాలో పోలిస్తే.. 16,884 మంది ఓటర్లు పెరిగారు. 2023 జనవరి జాబితా ప్రకారం జిల్లాలో 19,77,660 మంది ఓటర్లు ఉన్నారు. తాజా జాబితాలో ఈ సంఖ్య 19,94,544కు చేరింది. అనంతపురం అర్బన్‌లో అత్యధికంగా 5,780 మంది పెరిగారు. కళ్యాణదుర్గంలో 691 ఓట్లు తగ్గిపోయాయి. గుంతకల్లు నియోజకవర్గంలో కేవలం రెండు ఓట్లు మాత్రమే పెరిగాయి. రాయదుర్గంలో 2,023, ఉరవకొండలో 4,086, తాడిపత్రిలో 1,492, శింగనమలలో 2,182, రాప్తాడు నియోజకవర్గంలో 2,000 చొప్పున పెరిగాయి.

తొలగింపులు 87,529.. చేర్పులు 1,04,413

ఓటరు జాబితా తయారీ క్రమంలో పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెళ్లాయి. వైసీపీ నేతలు టీడీపీ సానుభూతిపరులను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని టీడీపీ నాయకుల సాక్ష్యాలతో అధికారులకు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీవారు బోగస్ పేర్లను చేరుస్తోందని, మృతుల పేర్లను తొలగించనివ్వకుండా చూస్తోందని కూడా టీడీపీ ఫిర్యాదు చేసింది. జీరో డోర్ నంబర్లపై ఓట్లు, డబుల్ ఎంట్రీలనూ పసిగట్టింది. గంపగుత్తగా టీడీపీ సానుభూతి పరుల ఓట్ల తొలగింపునకు క్లెయిమ్స్ నమోదు చేశారని, విచారించాలని డిమాండ్ చేసింది. వీటన్నింటినీ పరిశీలించి పరిష్కరించామని కలెక్టర్ ప్రకటించారు. ఫిర్యాదుల ఆధారంగా 87,529 ఓట్లను జాబితా నుంచి తొలగించామని తెలిపారు. అర్హులైన 1,04,413 మందిని ఓటరు జాబితాలో చేర్చామని కలెక్టర్ పేర్కొన్నారు. మరో 17 వేల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై పరిశీలన జరుగుతోందని తెలిపారు. అందులో అర్హులకు ఓటరు జాబితాలో అవకాశం కల్పిస్తామని తెలిపారు.

నలుగురిపై కేసులు.. ఇద్దరిపై ఫిర్యాదు

ఫిర్యాదుల విషయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన, అధికారులకు అసత్య సమాచారం ఇచ్చినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామని కలెక్టరు తెలిపారు. అసత్య సమాచారంతో గంపగుత్తగా ఫారం-7లను ఆన్‌లైన్‌లో నమోదుచేయడం చట్టవిరుద్ధమని అన్నారు. అలాంటి అక్రమాలకు పాల్పడిన నలుగురిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేయించామని తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో ముగ్గురిపైన, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఒకరిపైన కేసులు నమోదు చేయించామని అన్నారు. రాప్తాడులో ఒకరు, కళ్యాణదుర్గంలో ఒకరిపై ఫిర్యాదు చేశామని, వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు అవుతాయని తెలిపారు.

యువ ఓటర్లే కీలకం..

రానున్న ఎన్నికల్లో యువ ఓటర్ల ఓట్లే కీలకంగా మారాయి. జిల్లాలోని ఓటర్లలో సగ భాగం 40 ఏళ్ల లోపువారే. జిల్లాలో మొత్తం 19,94,544 మంది ఓటర్లు ఉండగా అందులో 18 నుంచి 40 ఏళ్లలోపు వారు 9,74,808 మంది ఉన్నారు. జిల్లాలో 80 సంవత్సరాలు పైబడిన ఓటర్లు కేవలం 26,963 మంది మాత్రమే ఉన్నారు.

వయస్సుల వారీగా ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే...

వయస్సు	సంఖ్య
18 - 19	36,837
20 - 29	3,54,838
30 - 39	5,83,133
40 - 49	4,25,309
50 - 59	2,95,931
60 - 69	1,79,991
70 - 79	91,542
80 పైన	26,963








గుత్తిలో కంటతడి పెడుతున్న అంగన్‌వాడీలు


అనంతలో...


అనంతలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు


చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ సహాయకురాలు సరితను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

వస్తారా..? రారా..?

- అంగన్‌వాడీల మెడపై కత్తి
- హడలిపోయి విధుల్లో చేరిన పలువురు
- కన్నీరు కారుస్తూ జాయినింగ్ లెటర్లు
- సీడీపీఓ కార్యాలయాల వద్ద ఉద్వేగం
- అనంతలో ఒకరి ఆత్మహత్యాయత్నం
- ప్రభుత్వం తీరుపై సీపీఎం, సీఐటీయూ ఆగ్రహం
- క్లాక్ టవర్ సర్కిల్‌లో రాస్తారోకో.. నాయకుల అరెస్టు
- రేపు రాష్ట్ర బంద్‌కు పిలుపు

అనంతపురం విద్య/గుత్తి, జనవరి 22: పెరిగిన దరలకు.. వచ్చే వేతనానికి పొంతన లేకుండా పోయింది. పనిభారం మాత్రం నానాటికీ పెరుగుతోంది. కనీస వేతనం ఇచ్చి తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వానికి ఎన్ని మార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమ్మెకు దిగారు. జిల్లా వ్యాప్తంగా 42 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సానుభూతితో పరిశీలించాల్సిన ప్రభుత్వం.. 'విధుల్లో చేరుతారా..? ఉద్యోగాల నుంచి తొలగించమంటారా..?' అని బెదిరింపులకు దిగింది. దిక్కుతోచని స్థితిలో కొందరు విధుల్లో చేరారు. ఈ క్రమంలో కన్నీటిపర్యంతం అయ్యారు. ఒకరు విషం తాగి ఆత్మహత్యకు యత్నించారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సీఐటీయూ, సీపీఎం నాయకులు నగరంలో ఆందోళనకు దిగారు. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 24న అన్ని ట్రేడ్ యూనియన్లు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి.

కన్నీటి సుడులు

షోకాజ్ నోటీసు గడువు ముగియడంతో ఉద్యోగాలు పోతాయన్న భయంతో పలువురు విధుల్లో చేరేందుకు సీడీపీఓ కార్యాలయాల వద్దకు వెళ్లారు. జిల్లాలోని 11 సీడీపీఓ ప్రాజెక్టుల వద్దకు ఉదయమే వందలాది మంది చేరుకున్నారు. అనంతపురం, రూరల్, గుత్తి సీడీపీఓ కార్యాలయాల వద్ద పలువురు కన్నీరు పెట్టుకున్నారు. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు గుత్తి సీడీపీఓ కార్యాలయంలో జాయినింగ్ లెటర్లు ఇచ్చారు. ఈ క్రమంలో పామిడికి చెందిన జయంతి అనే కార్యకర్త విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోయారు. ఆమెను తోటి వర్కర్లు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా, పక్కనే ఉన్న టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సావిత్రి, పామిడికి చెందిన యశోద, గుంతకల్లుకు చెందిన రేష్మాఖాన్ సొమ్మసిల్లి పడిపోయారు. వీరందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందజేశారు. మహిళల ఏడ్పులతో గుత్తి సీడీపీఓ కార్యాలయం, ఆస్పత్రి వద్ద విషాద వాతావరణం కనిపించింది. అంగన్‌వాడీల ఆవేదన చూసిన పలువురు యూనియన్ నేతలు వారిని ఓదార్చారు. బాధపడవద్దని, సమ్మెను తాత్కాలికంగానే వాయిదా వేస్తున్నామని తెలిపారు.



హెల్పర్ ఆత్మహత్యాయత్నం



విధుల్లో చేరకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని అధికారులు హెచ్చరించడంతో అనంతపురం రాణీనగర్ 9 సెంటర్ హెల్పర్ సరిత ఆదివారం రాత్రి విషం తాగి ఆత్మహత్యకు యత్నించారు. సమ్మె నేపథ్యంలో జీతంలో కోత పడింది. అధికారుల ఒత్తిడి, కుటుంబ సమస్యల నడుమ ఆమె బలవన్మరణానికి యత్నించారు. విషం తాగిన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 'నాకు ఇద్దరు పిల్లలున్నారు. నేనొక్కదాన్నే కుటుంబాన్ని నెట్టుకురావాలి. నిత్యావసరాల ధరలు పెరిగాయి. ఈ జీతంతో బతకడం కష్టంగా మారింది. జీతం పెంచమంటే ఎస్మా చట్టాన్ని ప్రయోగించారు. ఉద్యోగం పోతే ఎలా బతకాలో అనే ఆందోళనతో చావాలని అనుకున్నా..' అని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆమెను పరామర్శించారు. భర్తలేని, ఇద్దరు పిల్లలున్న హెల్పర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆత్మహత్యలు వద్దు.. పోరాడుదాం

- ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

ప్రభుత్వ వేధింపులకు జడిసి ఎవరూ ఆత్మహత్యకు పాల్పడవద్దని, పోరాడి హక్కులను సాధించుకుందామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అన్నారు. ఆత్మహత్యకు యత్నించి ఆయా సరితను ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మతో ఆమె పరామర్శించారు. లక్ష మందికి పైగా మహిళలు నెలన్నర నుంచి సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించకపోవడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి.. ఎన్నికల తర్వాత పోలీసుల చేత అణచివేయించడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం కల్చరల్: అంగన్‌వాడీలను అణచివేయాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం క్లాక్‌టవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. అరగంటపాటు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో సీఐలు రెడ్డప్ప, ధరణి కిశోర్ నేతృత్వంలో పోలీసులు వారిని అరెస్టు చేసి, టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించకుండా సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఆయన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమ్మెలో ఉన్నవారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, పోలీసుల ద్వారా ఉద్యమాన్ని అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ మొండి వైఖరివల్ల అనంతపురం నగరానికి చెందిన సహాయకురాలు ఆత్మహత్యకు యత్నించారని, గుత్తి ప్రాజెక్టులో మరో ముగ్గురు మానసిక ఒత్తిడితో ఆస్పత్రిలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వీ నాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్రి, నల్లప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ ఎస్టీ సంఘాల రాష్ట్ర నాయకులు సాకే హరి, రాజు పాల్గొన్నారు.

నిజమేనా..?

అధికారుల బెదిరింపులతో పలువరు వర్కర్లు, హెల్పర్లు విధుల్లో చేరారు. కానీ అధికారులు చెబుతున్న లెక్కలు అనుమానాస్పదంగా ఉన్నాయి. 22వ తేదీ వర్కర్లు 1862 మంది, ఆయాలు 1,647 మంది విధుల్లో చేరానని పీడీ శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. 21, 22 రెండు తేదీల్లో కలిపి వర్కర్లు 2,253 మంది, ఆయాలు 2,007 మంది విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు.

రేపు రాష్ట్ర బంద్

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్



సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యానికి పాల్పడింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అంగన్‌వాడీలు కన్నీరు పెట్టుకుంటూ విధుల్లోకి చేరుతున్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ తీరుకు నిరసనగా అన్ని ట్రేడ్ యూనియన్లతో కలసి ఈ నెల 24న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నాం.

స్పెషల్ కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు


కోర్టు ఆవరణలో ఉన్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 22: విజయవాడలోని స్పెషల్ కోర్టుకు ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు సోమవారం హాజరయ్యా రు. 2011లో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య జరిగిన గొడవకు సంబంధించిన కేసులో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు బీకే పార్థసారధి, గోనుగుంట్ల సూర్యనారాయణ, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, ప్రకాష్‌నాయుడు, బీవీ వెంకటరాముడు, స్వామిదాస్, సరిపూటి రమణ, కూచి హరి, కృష్ణకుమార్, మణికంఠ, చెన్నప్ప కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు.

విధుల్లో చేరిన డీఆర్‌ఎం వినీత్ సింగ్


నూతన డీఆర్‌ఎం వినీత్ సింగ్‌కు శుభాకాంక్షలను తెలుపుతున్న మనీశ్ అగర్వాల్

గుంతకల్లు, జనవరి 22: స్థానిక డీఆర్‌ఎం మనీశ్ అగర్వాల్ బదిలీకాగా, ఆయన స్థానంలో నూతన డీఆర్‌ఎంగా వినీత్ సింగ్ సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ప్రస్తుతం డీఆర్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న మనీశ్ అగర్వాల్ నాగపూర్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. సంబల్పూర్ డీఆర్‌ఎంగా పనిచేస్తున్న వినీత్ సింగ్‌ను గుంతకల్లు డీఆర్‌ఎంగా బదిలీచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం వినీత్ సింగ్ గుంతకల్లుకు వచ్చారు. తొలుత కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో అర్చకులు డీఆర్‌ఎంకు ఆశీర్వచనం పలికి శాలువతో సన్మానించారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లారు. డీఆర్‌ఎం మనీశ్ అగర్వాల్ వినీత్ సింగ్‌ను సాదరంగా ఆహ్వానించి బాధ్యతలను అప్పగించారు. సబార్డినేట్ అధికారులు, సిబ్బంది సహకారాన్ని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించాడు

- ఆర్‌ఎస్‌ఐపై పోలీసులకు యువతి ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 22: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైబ్రరీని పర్యవేక్షించమంటే ఆ ఆఫీసర్ ప్రేమ వలలో పడ్డాడు. శిక్షణ కోసం వచ్చే ఇంజనీరింగ్ చదివిన ఓ యువతితో ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ప్రేమ వ్యవహారం నడిపాడు. కొత్తగా ఉద్యోగం రావడంతో ఆ పోలీస్ సార్ పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆ లైబ్రరీకి వస్తున్న ఓ యువతి నమ్మింది. ప్రేమించాక ఏం జరిగిందో తెలియదు కానీ తనకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాడంటూ ఆ యువతి ఆదివారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గతంలో జిల్లా ఎస్పీగా ఫక్కీరప్ప ఉన్న సమయంలో పోలీస్ లైబ్రరీకి పర్యవేక్షకుడిగా ఆర్ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఆర్ఎస్ఐపై బదిలీ వేటు వేసినట్లు జిల్లా పోలీస్ అధికారులు సోమవారం ప్రకటించారు. కానీ అతనిని ఆదివారమే చిత్తూరుకు బదిలీ చేయడం గమనార్హం. ఈయనతో పాటు బాలాజీ నాయక్, మగ్బూల్, రమేష్‌నాయక్, ముస్తఫాలను చిత్తూరుకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీలకు స్వాతంత్ర్యం ఎక్కడ?

- ఐదేళ్లుగా వారిపైనే దాడులు
- ఎమ్మెల్యే దోపిడీకి అడ్డుకట్ట వేస్తా
- జయహో బీసీ సభలో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, జనవరి 22: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ల గడిచినా, ధర్మవరం నియోజకవర్గంలో ఐదేళ్లుగా బీసీలు స్వాతంత్ర్యం కోల్పోయి బతుకుతున్నారని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండల కేంద్రంలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. వందలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు, ముందుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు, అంబేడ్కర్, వాల్మీకి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరించారు. మండలకేంద్రంలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందుపురం పార్లమెంట్ బీసీ అధ్యక్షుడు రంగయ్య, అంబికా లక్ష్మీనారాయణ, వడ్డే వెంకట్, బీసీ నాయకులు హాజరయ్యారు. నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మలమనోహర్, కనుమ చంద్ర, సూర్యశేఖర్‌రాజు, చికెన్‌తిరుపాల్, రాధమ్మ,గడ్డంమోహన్, వినోద్, ఆనంద్, కోట్లబాబి, మహబూబ్‌పీరా, చల్లారంగయ్య, జానీ, నారాయణస్వామి, రంగనాయకులు, సాంబశివనాయక్, మండలంలోని టీడీపి కార్యకర్తలు జనసేన నాయకులు గుర్రంజయచంద్ర, పురుషోత్తం, గుణశేఖర్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


బైకు ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అందరి లెక్కలు తేలుస్తా: పరిటాల శ్రీరామ్



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ధర్మవరం నియోజకవర్గంలో వింత పరిస్థితి ఉంది. ఇక్కడ ఎవరికైనా డబ్బు ఉందనో, ఆస్తి ఉందనో చెప్పుకోవడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. బీసీ కులాలకు చెందిన వారు నియోజకవర్గంలో టీడీపీ జెండా పట్టాలంటే భయపడే పరిస్థితి. ఇన్నిరోజులుగా ఎమ్మెల్యేకి భయపడి మౌనంగా ఉన్నారు. ఇప్పుడైనా ధైర్యంగా ముందుకురండి. దోపిడీదారులు రెవెన్యూ ఆఫీసుల్లోనూ, రిజిస్టర్ కార్యాలయాల్లోని గేట్ల వద్ద ఉంటున్నారు. వారు సాగించిన దోపిడీలకు బలైంది ఎక్కువమంది బీసీలే. లోకేశ్ రాష్ట్రంలో ఉన్న వారి లెక్కలు తేలిస్తే, ధర్మవరం నియోజకవర్గంలో పెత్తందారీగా మారిన వారి లెక్క తేలుస్తా.

ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం: గుండుమల



ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం. పరిటాల కుటుంబం అంటే అన్ని ప్రాంతాల వారికి అభిమానం. బడుగు బలహీన వర్గాలు అత్యంత ఇష్టపడే కుటుంబం పరిటాల కుటుంబం. ఆ కుటుంబం నుంచి వచ్చిన శ్రీరామ్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, సీఎం జగన్ ఏమి ఉద్ధరించాడని ఉరవకొండకు వస్తున్నాడో చెప్పాలి.


పరిటాల శ్రీరామ్, కందికుంటకు గజమాలతో సత్కారం

బీసీలు అనుకుంటే అన్ని స్థానాలు టీడీపీవే: కందికుంట



ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. వారు అనుకుంటే అన్ని స్థానాలు గెలుస్తాం. సీఎం జగన్ నాకు 50 శాతం ఓట్లు వచ్చాయని, 150 సీట్లు వచ్చాయని గర్వంతో ఇన్నిరోజులు పాలన సాగించాడు. ఆ గర్వం దించాలంటే అది బీసీలతోనే సాధ్యం. అప్పట్లో ఎన్టీఆర్ బీసీలకు ధైర్యం నింపి చట్టసభలకు పంపిస్తే, ఈసారి అదే బీసీలు భయంతో బతకాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న బీసీ కార్పొరేషన్లకు అధికారం, నిధులు, విధులు నేతి బీరకాయలో నెయ్యిలా మారాయి. ధర్మవరం నియోజకవర్గంలో అధికార పార్టీ దోపిడీ ప్రభుత్వ కార్యాలయాల సాక్షిగా కనిపిస్తోంది. ప్రతి ఒక్కరు ఈ 80 రోజులు రోజుకు గంట పని చేస్తే చాలు టీడీపీ గెలుపు ఖాయం.

సీఎం పర్యటనకు... జన సమీకరణ కష్టాలు!

అనంతపురం క్లాక్‌టవర్/రాయదుర్గం, జనవరి 22: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందంగా... సీఎం జగన్ పర్యటన యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మ హిళలకు కష్టాలు తెచ్చిపెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మం గళవారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఉరవకొండ ప్రాంతంలో నిర్వహించే ఆసరా పథకం నిధుల చెల్లింపు సభకు లక్ష మంది జనాలను తరలించాలని ప్రధానంగా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు, ఉద్యోగులు, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామాల వారిగా జనాలను సమీకరించేందుకు పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో టాంటాం వేస్తున్నారు. ప్రధానంగా ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు, కళ్యాణదుర్గం, కణేకల్ మండలాల నుంచి అధికంగా జనాలను తరలించేందుకు సిబ్బంది నిమగ్నమయ్యారు. ఒక్కో మండలానికి వంద బస్సులు చొప్పున ఇప్పటికే కేటాయించారు. పింఛన్, ఆసరా, జగనన్న తోడు తదితర ప్ర భుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు కచ్చితంగా సీఎం సభకు రావాలని, లేకుంటే పథకం కట్ చేస్తామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మోటారు వాహనాల అధికారులు వాహనాల సమీకరణలో నిమగ్నమై సఫలీకృతులయ్యారు. కర్ణాటకకు చేరువలో ఉండడంతో చిత్రదుర్గం, బళ్లారి జిల్లాలలోని ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకు వస్తున్నారు. కర్ణాటకలో మాత్రమే రవాణాకు అనుమతులున్న బస్సులను తీసుకొచ్చి సీఎం సభకు జనం తరలించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్ర పర్మిట్లు ఉన్న వాహనాలు తీసుకువచ్చి నిబంధనలు విరుద్ధంగా జన తరలింపు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సోమవారం రాత్రికి ఆయా వాహనాలన్నీ చేరుకోవడంతో వాటిని గ్రామాలకు కేటాయింపులు చేసి సాగనంపారు.

స్కూళ్లకు సీఎం టూర్ హాలిడే!

- మామయ్య వస్తున్నాడు... ప్రైవేట్ స్కూళ్లకు సెలవ్
- ఎఫ్‌ఏ- 3 పరీక్షలు ఉన్నా.. వాయిదా ప్రకటన
- అధికార పార్టీకి సాగిలపడుతున్న డీఈఓ

అనంతపురం విద్య, జనవరి 22: సాధారణంగా ఆదివారం, 2వ శనివారం స్కూళ్లకు సెలవు. ఇప్పటి వరకూ ఇలాంటి సెలవులు గురించే విన్నాం. కానీ జగన్ మామయ్య అధికారంలోకి వచ్చాక.... సీఎం టూర్ హాలిడేస్ అంటూ కొత్తగా వింటున్నాం. పిల్లలకు పరీక్షలు ఉండనీ, మరేదైనా ఉండనీ...మామయ్య వచ్చాడంటే వెంటనే సెలవులు ఇచ్చేయడమే. అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లకు మంగళవారం సెలవులు ఇస్తూ....డీఈఓ మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్ల నుంచి 5 లేదా 10 చొప్పున బస్సులు పంపాలంటూ.... విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికార పార్టీ నాయకులను, కార్యకర్తలను తరలించానికి వందలాది ప్రైవేట్ బస్సుల బస్సుల తీసుకురావాలని స్కూళ్ల కరస్పాండెంట్లను హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మంగళవారం ఎఫ్‌ఏ-3 పరీక్షలు ఉన్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయినప్పటికీ జగన్ వస్తున్నాడంటూ.. ఆ పరీక్షలను సైతం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 31న పరీక్షలు నిర్వహించాలని కరస్పాండెంట్లకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీనిపై ఇన్‌చార్జి డీఈఓ వివరణ కోసం ఆయనకు ఫోన్ చేయగా... ఆయన సమాధానం ఇవ్వలేదు.


గౌరవనీయులు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు గారి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా లోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు 23.01.2024 తేదీ మంగళవారం నాడు కాంపెన్సేటరీ సెలవు దినముగా ప్రకటించడం జరిగింది.
ఆ దినం జరగవలసిన FA-3 పరీక్షలు 31.01.2024 బుధవారం నాడు నిర్వహించాలని ఆదేశించడం అయినది.
ఈ ఆదేశాలు కేవలం అనంతపురం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తాయి

సెలవు ఇచ్చినట్లు డీఈఓ పేరుతో వైరల్ అవుతున్న సందేశం

వైసీపీ సేవలో డీఈఓ తరిస్తున్నారు

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి



ఉరవకొండకు సీఎం జగన్ వస్తున్నాడంటూ డీఈఓ నాగరాజు ఉన్నఫలంగా ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ఎలా ప్రకటిస్తారు. ఆయన అధికార వైసీపీ నాయకుల సేవలో పూర్తిగా తరిస్తున్నాడు. ఎఫ్‌ఏ-3 పరీక్షలు ఉన్నాయని, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే జగన్ వస్తున్నాడని ఏకంగా పరీక్షలను 31వ తేదీన నిర్వహించేలా వాయిదా వేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారంటూ మండిపడ్డారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- కారు బోల్తాపడి ఇద్దరు..
- ఆటోను లారీ ఢీకొని ఒకరు..



పార్థసారథి, తులసమ్మ (ఫైల్)

పెనుకొండ రూర ల్, జనవరి 22: పెనుకొండ పట్టణంలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... ఒకే కుటుంబానికి చెందిన వారు బంధువుల పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు కారుబోల్తాపడి ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన పెనుకొండ మండలం గోనిపేట బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సంఘటనలో ధర్మవరానికి చెందిన పార్థసారథి (57), తల్లి తులసమ్మ(75) మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం నేసేపేటకు చెందిన సిల్క్‌వ్యాపారి పార్థసారథి తల్లి తులసమ్మ భార్య మంజుళ, కుమారుడు అఖిల జశ్వంత్, కుమార్తె సౌమ్య గురువారం ఉదయం ధర్మవరం నుంచి కారులో తమిళనాడులోని కంచికి బంధువుల పెళ్లికి వెళ్లారు. రిసెప్షన్ చూసుకుని తిరిగి సోమవారం ఉదయం కారులో ధర్మవరం వస్తుండగా పెనుకొండ సమీపంలోని గోనిపేట బ్రిడ్జి వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పార్థసారథి, తల్లి తులసమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మంజుళ, అఖిలజశ్వంత్, కృష్ణ సౌమ్యలను స్థానికులు 108 సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మంజుళ, జశ్వంత్‌లను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మృతుడి కుమార్తె సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గూడ్స్ ఆటోను ఢీకొన్న లారీ
ఒకరి మృతి... ఐదుగురికి గాయాలు

పట్టణంలోని శ్రీ కృష్ణదేవరాయల జైజంక్షన్ వద్ద 44వ జాతీయరహదారిపై గుర్తుతెలియని లారీ గూడ్స్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటక వాసి శిరీష(26) మృతిచెందగా మరో ఐదుగురు గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పలవల్లికి చెందిన హరీష్, భార్య శిరీష, కుటుంబసభ్యులు కలిసి కొన్నేళ్లుగా రికార్డింగ్ డ్యాన్సులు, వీధి నాటకాలు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మండలంలోని గోనిపేటలో రికార్డింగ్ డ్యాన్స్ ముగించుకుని గూడ్స్ ఆటోలో తిరిగి పెనుకొండకు వస్తుండగా శ్రీకృష్ణదేవరాల సర్కిల్ వద్ద పెనుకొండవైపు మలుపు తిరుగుతుండగా గుర్తుతెలియని లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శిరీష అక్కడికక్కడే మృతిచెందగా భర్త హరీష్, కుమారులు విక్కీ, జోసఫ్, కు మార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల అనం తరం మెరుగైన వైద్యం కోసం హరీష్‌ను తుమకూరుకు తరలించారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు బోరున విలపించారు. పిల్లలను చూసిన వారు కంటతడి పెట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


శిరీష (ఫైల్)


గాయపడిన చిన్నారులు

వామ్మో సీఎం సభనా..?

- పాత బకాయిలు చెల్లిస్తే సరి
- లేదంటే వాహనాలకు మేం డీజిల్ వేయలేం
- తేల్చి చెప్పిన పెట్రోల్ బంకుల యజమానులు

అనంతపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం సభ అంటేనే పెట్రోల్ బంకుల యజమానులు బెంబేలెత్తుతున్నారు. వామ్మో సీఎం సభనా అంటూ బిత్తరపోతున్నారు. డబ్బులిస్తేనే... డీజిల్ వేస్తామని తేల్చి చెప్పేస్థితికి యజమానులు వచ్చారు. ఇందుకు ప్రధాన కారణం లేకపోలేదు. జిల్లాలో ఎక్కడ సీఎం సభ జరిగినా... వాహనాలు సమకూర్చాల్సిందే... ఆ వాహనాలకు డీజిల్ వేయించాల్సిందే. ఆ బాధ్యతను సంబంధిత శాఖాధికారులు భుజాన ఎత్తుకొని మోస్తున్న పరిస్థితి జిల్లాలో ఉంది. అయ్యా బాబూ... సీఎం సభకు జనాన్ని తరలించాలి. ఏ వాహనం డీజిల్ బంకు దగ్గరకొచ్చినా డీజిల్ పట్టండి. డబ్బులు మళ్లీ ఇస్తామంటూ పెట్రోల్ బంకుల యజమానులను సంబంధిత అధికారులు బతిమలాడుకుంటున్నారు. సీఎం సభ నిర్వహించే రోజుల్లో సభ నిర్వహణలో భాగంగా జనాన్ని తరలించేందుకు వినియోగిస్తున్న ప్రైవేట్ వాహనాలకు డీజిల్ పోయించేందుకు ఆ రోజుకారోజు నిధులు విడుదల చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. గతేడాదిలో కళ్యాణదుర్గం, పుట్టపర్తిలో నిర్వహించిన సీఎం సభలకు సంబంధించి జనాన్ని తరలించేందుకు వినియోగించిన వాహనాలకు డీజిల్ వేసినందుకుగానూ రూ.60 లక్షల వరకూ పెట్రోల బంకుల యజమానులకు బకాయి పడినట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇప్పటికీ ఆ బకాయి చెల్లించకపోవడంతో... ఉరవకొండలో మంగళవారం నిర్వహించనున్న సీఎం సభ కోసం జనాన్ని తరలించేందుకు సంబంధిత అధికారులు సిద్ధం చేసిన వాహనాలకు డీజిల్ వేసేందుకు పెట్రోల్ బంకు యాజమానులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. పాత బకాయి చెల్లిస్తేనే... డీజిల్ వేస్తామని తేల్చి చెప్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి ఎదురవుతోంది. ఇదిలా ఉండగా... పాత బకాయి చెల్లిస్తాము... ఈసారికి డీజిల్ అప్పుగా వేయండంటూ యజమానులను అధికారులు బతిమలాడుతున్నా... వేసేందుకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు సంబంధిత అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుండటం గమనార్హం.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647 AJA- 150694

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి Goverment colleges లో B.Sc (Nursing).B.Sc (MLT),BPT(ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్ టెస్ట్ కోర్సు) నందు అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు కాలేజీలోనే హాస్టల్ వసతి కలదు.సంప్రః జి.మురళి,అనంతపురం సెల్ : 9030661651 AJA- 150693

కావలెను

అనుభవం కల్గిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ మరియు జూనియర్ అకౌంటెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం సంప్రః JK.Enterprises, Opp Montessori School, Gooty Road, ATP, Cell:8008803109. AJA175015

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి


నగర సంకీర్తన నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


అనంతపురంలో వాల్మీకి విగ్రహం వద్ద టీడీపీ వాల్మీకి సాధికార సమితి నాయకుల పూజలు


కమలానగర్‌లో దుకాణాల వద్ద..


అరవిందనగర్ బాలాంజనేయస్వామి ఆలయంలో మాజీ మేయర్ స్వరూప


పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఓం సంగీతం, నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు కౌశల్య బృందం

అంతా రామమయం

అనంతపురం కల్చరల్ : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం జిల్లావ్యాప్తంగా రామభక్తులు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీనివాస్‌నగర్ సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో రాములవారికి 11 కిలోల లడ్డూతోపాటు 71 రకాల నైవేద్యాలను సమర్పించారు. వందలమంది రామభక్తులు రాములవారి కాషాయ జెండాలతో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేసి రాములవారి విగ్రహప్రతిష్ఠను లైవ్‌లో వీక్షించారు. అరవిందనగర్ బాలాంజనేయస్వామి దేవాలయంలో మాజీ మేయర్ మదమంచి స్వరూప జ్యోతులు వెలిగించారు. టీడీపీ వాల్మీకి సాధికార సమితి నాయకులు స్థానిక బోయవీధిలోని వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు.


రెవెన్యూకాలనీ రామాలయంలో...


శ్రీనివాస్ నగర్ రామాలయంలో...


గీతామందిర్‌లో ..


వేషధారణలతో ఆకట్టుకుంటున్న రామసేన


పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో


తిలక్ రోడ్డు రామాలయంలో..


సోమనాథ్‌నగర్‌లో నగర సంకీర్తన


మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు


ఆరో రోడ్డులో అన్నదానం నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ విజయశ్రీ, శ్రీనివాసరెడ్డి దంపతులు


పాపంపేట రామాలయంలో..


గార్లదిన్నె వెంకటేశ్వరస్వామి ఆలయంలో భజన


సీకేపల్లిలో సీతారామలక్ష్మణులకు అలంకరణ


శింగనమల ఆత్మరామస్వామి ఆలయంలో...


బండమీదపల్లిలో సీతారాముల అలంకరణ


అనంతపురం శ్రీనివాసనగర్‌లో రాములవారికి నైవేద్యాలు

అంగన్‌వాడీ సహాయకురాలికి పరామర్శ


సరితను పరామర్శిస్తున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 22: వైసీపీ బెదిరింపులకు భయపడి విషద్రావకం తాగి ప్రాణాపాయస్థితిలో ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు సరితను జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత పరామర్శించారు. సోమవారం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను శ్రీలత పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. తెలుగు మహిళలు స్వప్న, విజయ శ్రీరెడ్డి కూడా సరితను పరామర్శించారు.

అంగన్‌వాడీలను జగన్ నట్టేట ముంచాడు : టీసీ వరుణ్

ఎన్నికలకు ముందు నా అక్కాచెల్లెళ్లు అంటూ... అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌రెడ్డి అంగన్‌వాడీలను నట్టేట ముంచాడని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మండిపడ్డారు. సోమవారం అంగన్‌వాడీ సహాయకురాలు సరిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. అంగన్‌వాడీలు తమ డిమాండ్లను పరిష్కరించాలని రోడ్లెక్కి నిరసనలు చేస్తున్నా సీఎం జగన్‌కు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు.

రైతు సంఘం నాయకులకు ముందస్తు నోటీసులు

అనంతపురంరూరల్, జనవరి 22: రైతుల సమస్యలను రాష్ట్రముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి వినిపించే వీలు లేకుండా రైతు సంఘం నాయకులు, ఇతర నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేస్తున్నారు. అందులో భాగంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజుకు మండలంలోని కందుకూరులో పోలీసులు నోటీసులు అందజేశారు. హౌస్ అరెస్టు చేశారు.

శింగనమల : ఉరవకొండలో మంగళవారం సీఎం పర్యటన సందర్భంగా నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ నాయకుడు ఓబిలేసుకు పోలీసులు ముందస్తు నోటీసు అందజేశారు.

పెద్దమ్మ గుడి నిర్మాణానికి రూ.50వేలు విరాళం

శింగనమల జనవరి 22: మండలంలోని నిడనవాడ గ్రామంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు రూ.50 వేలు విరాళం అందజేశారు. సోమవారం ఆ గ్రామ పెద్దలకు ఆ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, కళ్లాయప్ప, నారాయణస్వామి కాయల సరేష్ పాల్గొన్నారు.

కోడికత్తి శీనుకు న్యాయం చేయాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 22: కోడికత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి.. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష చేశారు. దళిత యువకుడు శీను కట్టుదిట్టమైన భద్రత నీడలో కోడికత్తితో ఎలా దాడిచేసారో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత జగన్‌పై ఉందన్నారు. శీనుకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని తెలిపారు.

రేపటి రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జనవరి 22: అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బుధవారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం కోరారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాలు ఈ ధర్నాకు మద్దతుగా పాల్గొంటున్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ బంద్‌లో పాల్గొని అంగన్‌వాడీల పోరాటానికి సంఘీభావం తెలపాలని కోరారు.

అనంత మెడికోల ప్రతిభ

అనంతపురం టౌన్ : అనంత మెడికల్ కళాశాలలో వైద్యవిద్యను అభ్యసిస్తున్న మెడికోలు ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్య శిబిరంలో ప్రతిభ కనబరచి ప్రశంసలు అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. హైదరాబాద్ మల్లారెడ్డి మెడికల్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరానికి అనంత కళాశాలకు చెందిన పరిణితిసాయి, సాయిసుష్మ, విద్యాసాగర్ పాల్గొన్నారు. అక్కడ జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంశలు అందుకున్నారు. ఆ మెడికోలను సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు పరదేశీనాయుడు అభినందించారు.

అంగన్‌వాడీలకు తొలగింపు ఉత్తర్వులు దారుణం

అనంతపురం అర్బన్, జనవరి 22: తన న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలను ఉద్యోగం నుంచి తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని టీడీపీ నాయకులు మండిపడ్డారు. సోమవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ నాయకులు శివాజీ, మార్కెట్ మహేష్ మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శింగనమల : రాష్ట్రంలో అంగన్‌వాడీలను, హెల్పర్లను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే వారికిచ్చిన హామీలను నెరవేర్చి.. వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక

గార్లదిన్నె, జనవరి 22 : జాతీయ ప్రతిభా పురస్కారం కింద కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనం పొందేందుకు ఆదర్శ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న షామీర్‌వలి, ఇమామ్‌హుసేన్, సంజయ్‌కుమార్ ఎంపికయ్యారు.

రైతు ద్రోహి.. ప్రకాష్‌రెడ్డి

రిజర్వాయర్ల నిర్మాణంపై ప్రజలకు సమాధానం చెప్పాలి: మాజీ మంత్రి పరిటాల సునీత


భానుకోటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

ధర్మవరంరూరల్, జనవరి 22: కనగానపల్లి మండలంలో మంజూరైన పుట్టకనుమ రిజర్వాయర్‌ను రద్దుచేసి కొత్త రిజర్వాయర్లను నిర్మించకుండా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రైతుద్రోహిగా మారారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. కనగానపల్లి మండలంలోని పాతపాళ్యం, భానుకోట గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ మినీ మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. జీడీపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరు తీసుకువచ్చే క్రమంలో పుట్టకనుమ రిజర్వాయర్‌ను ఏర్పాటుకు కోసం టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరుచేసి కొంతపనులు చేశామన్నారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే దాన్ని రద్దుచేసి రైతులకు అన్యాయం చేశారన్నారు. వైసీపీకి, ప్రకాష్‌రెడ్డికి రైతులే బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పాతపాళ్యంలో ఇటీవల మరణించిన కళ్యాణి, కురుబసంగప్ప కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ పోతలయ్య, పూజారి రాజాకృష్ణ, వేణు, రాజు, ఆంజనేయులు, యువరాజు, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, నారాయణ, రాజయ్య, గంగాధర్, సర్పంచ్ సోమరచంద్రశేఖర్, ఉమాపతి, సర్ధానప్ప తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పరిచయ వేదికకు ముఖ్యనేతలు గైర్హాజరు

బుక్కరాయసముద్రం, జనవరి 22: శింగనమల నియోజకవర్గం వైసీపీ నూతన సమన్వయకర్త, పార్లమెంట్ ఇన్‌చార్జి పరిచయవేదిక పేరుతో ఏర్పాటు చేసిన సమావేశానికి నియోజకవర్గంలోని ఆ పార్టీ ముఖ్య నేతలు గైర్హాజరు అయ్యారు. సోమవారం అనంతపురం గుత్తిరోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో శింగనమల నియోజకవర్గం వైసీపీ సమీక్షావేశంతో పాటు నూతన సమన్వయ కర్త వీరాంజినేయులు, అనంతపురం పార్లమెంట్ ఇన్‌చార్జి శంకర్‌నారాయణ పరి చయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అనారోగ్యం పేరుతో హాజరుకాలేదు. శింగనమల నియోజకవర్గంలోని ద్వితీయ స్థాయి నాయకులూ పూర్తిస్థాయిలో గైర్హాజర్ కావడం చర్చనీయంశమైంది. ప్రధానంగా నియోజకవర్గంలోని బుక్కరాయసముద్ర మండలంలోని మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, సహకార సొసైటీ ఛైర్మన్ గువ్వల వెంకటరెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్లు ఎస్ నాగలింగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సాకే మల్లికార్జున, మాజీ సర్పంచ్ సాకేనారాయణస్వామి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైరన్ సాకే రామక్రిష్ణ, మాజీ ఎంపీపీలు భాస్కర్‌రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డితో పాటు మండలంలోని పలువురు నేతలు గైర్హాజరయ్యారు. గార్లదిన్నె మండలంలో మార్కెట్ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి, శింగనమల మండలంలోని వైసీపీ కన్వీనర్ పట్నం నాగేష్, గోకుల్‌రెడ్డి, నార్పల మండలంలో మార్కెట్ మాజీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి వర్గీయులు హాజరు కాలేదు. పుట్లూరు, యల్లనూరు మండలంలో తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి వర్గీయులూ ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. మొదటిసారిగా నిర్వహించిన సమావేశానికే ముఖ్యనేతలు అంత గైర్హాజరు కావడంతో వీరాంజినేయులు, శంకర్‌నారాయణలో గుబులు రేపుతోంది.

తుది జాబితాలోనూ తప్పులే

రాప్తాడు, జనవరి 22: ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలోనూ అనేక తప్పులు కనిపించాయి. చనిపోయిన, వివాహమై వెళ్లిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో అలాగే ఉన్నాయి. రాప్తాడు మండలం బొగినేపల్లికి చెందిన హేమలతకు ఏడేళ్ల కితం వివాహమై వెళ్లిపోయింది. సోమవారం విడుదల చేసిన తుది జాబితాలో బొగినేపల్లి ఓటరు జాబితాలో ఆమె పేరు ఉంది. బొగినేపల్లిలో ఓటరు జాబితాలో సీరియల్ నెంబర్ 46లో దాసరి చంద్రశేఖర్‌కు ఓటు ఉంది. వాస్తవానికి చంద్రశేఖర్‌ది బొగినేపల్లి కాదు. అయినప్పటికీ ఆయనకు ఓటు ఉంది. బొగినేపల్లి ఓటరు జాబితాలో సీరియల్ నెంబర్ 479లో పెద్దన్నకు ఓటు ఉంది. అతను కొన్నేళ్ల కొందటే చెన్నేకొత్తపల్లి మండల హరియన్ చెరువు గ్రామంకు వెళ్లి స్థిరపడ్డారు. ప్రస్తుతం బొగినేపల్లిలో, హరియన్ చెరువు ఓటరు జాబితాలో రెండు చోట్లా ఇతనికి ఓటు ఉంది.

25న బాషావలిషా దర్గా ఉరుసు

అనంతపురంరూరల్ : మండలంలోని కొడిమి గ్రామం దర్గా కొట్టాల సమీపంలో హజరత్ ఖ్వాజా సయ్యద్ షా మొహమ్మద్ బాషవలి షా చిస్తీ ఉల్ ఖాద్రీ స్వామి దర్గా ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్ర 5గంటలకు గంధము, ఉరుసు ఉత్సవవేడుకలు బసగానపల్లెకు చెందిన సద్గురు హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రి స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో పలు ఆధ్యాత్మిక సందేశాలు, ఫకీర్ల జల్సాలు, అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

శింగనమల సీఐగా శ్రీధర్

శింగనమల జనవరి 22: శింగనమల సీఐగా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ అస్రార్ బాషా తిరుపతికి బదిలీ కాగా.. కర్నూల్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

సీపీఐ గ్రామ కమిటీ ఎంపిక

శింగనమల జనవరి 22: మండలంలోని కొరివిపల్లి గ్రామ సీపీఐ కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా సీపీఐ సమితి సభ్యుడు రామాంజినేయులు సోమవారం తెలిపారు. గ్రామకమిటీ కార్యదర్శిగా రాంమోహన్, సహాయ కార్యదర్శిగా రవిశంకర్, మరో 30 మందిని కమిటి సభ్యులుగా నియమించారు.

అడ్మిషన్లు ఎందుకు తగ్గాయ్? : ఎస్కేయూ వీసీ

అనంతపురం సెంట్రల్, జనవరి 22: వర్సిటీ క్యాంపస్‌లో పదుల సంఖ్యలో కోర్సులున్నా అడ్మిషన్స్ ఎందుకు తగ్గాయని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి ఆశ్చర్యాన్ని వ్యక్తంచేశారు. సోమవారం రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్స్, విభాగాల అధిపతులతో వీసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. న్యాక్ మంచి గ్రేడ్‌ను సాధిస్తే వర్సిటీ అంతర్గత ప్రమాణాలు పెంచుకోవచ్చునన్నారు. అయితే ఆ వైపు ఎందుకు ప్రయత్నించడంలేదన్నారు. న్యాక్ ప్రక్రియను వేగవంతంచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కృష్ణకుమారి, రామచంద్ర, సోమశేఖర్, విభాగాధిపతులు రామగోపాల్, వెంకటనాయుడు, మురళీధరరావు, నరసింహన్ పాల్గొన్నారు.

ముగిసిన చిరుధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 22: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిరుధాన్యాల పండుగ ప్రదర్శన సోమవారంతో ముగిసింది. ఇందులో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ.. రైతులు చిరుధాన్యాల సాగు పెంచాలన్నారు. తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో చిరుధాన్యాల నుంచి అధిక దిగుబడి, ఆదాయం పెంచుకునే మార్గాలపై రెడ్డిపల్లి కేవికే శాస్త్రవేత్త సుధారాణి, కేవికే మాజీ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, ఏఎఫ్ ఎకాలజీ మురళీకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

'జిల్లా వక్ఫ్‌బోర్డు'కు భవనం కేటాయించండి

అనంతపురం కల్చరల్ : జిల్లా వక్ఫ్‌బోర్డుకు సంబంధించి కలెక్టరేట్ ఆవరణంలో ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుందని, వక్ఫ్‌బోర్డు, మైనార్టీ కార్యాలయం కోసం అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని కేటాయించాలని జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్ డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అర్బన్: పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఆరంభమైంది. గతేడాది ఆఖరు వారంలో జిల్లాలోని 473 పోస్టులకు 919 మంది ఆన్‌లైన్ పరీక్షలకు హాజరయ్యారు. మెరిట్, రోస్టర్ మేరకు తొలి విడతలో 206 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, ఇతర అధికారులు సోమవారం 105 మంది అభ్యర్థుల సరిఫికెట్లు పరిశీలించారు. మంగళవారం మిగతా 101 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు.

ఆలమూరులో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

అనంతపురంరూరల్ : మండలంలోని ఆలమూరు గ్రామంలో స్థానికంగా ఉన్న శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ రవీంద్రారెడ్డి, గ్రామ సర్పంచు సౌమ్య హాజరయ్యారు. ఈ శిబిరం ద్వారా వారం పాటు గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయండి

నేడు నారాలోకేశ్ జన్మదినం సందర్భంగా బైక్ ర్యాలీ: వైకుంఠం

అనంతపురం అర్బన్ : రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. సోమవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాలోకేశ్ జన్మదినాన్ని పురష్కరించుకొని మంగళవారం ఉదయం 10 గంటలకు అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం నుంచి ఆర్ట్స్ కళాశాల సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం దాకా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో టీడీపీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిష్ నాగరాజు, మారుతీ కుమార్ గౌడ్, వన్నూరప్ప, మార్కెట్ మహేష్, ముక్తియార్, గోపాల్ గౌడ్, రాజారావు, పీఎం లక్ష్మీప్రసాద్, సుబాష్ చంద్రబోస్, రాయల్ రఘు, స్వప్న, దళవాయి రమాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా : వైసీపీకి టీడీపీ సవాల్

అనంతలో టీడీపీ హయాంలో ప్రభాకర్ చౌదరి చేసిన అభివృద్ధే తప్పా వైసీపీ పాలనలో చేసిందేమీ లేదని, వైసీపీ పాలనలో ఏం అభివృద్ధి కార్యక్రమాలు చేశారో చెప్పాలని టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు సవాల్ విసిరారు. సోమవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు ముక్తియార్, జేఎం బాషా, అజీజ్, నౌజియారఫి మాట్లాడారు. నగరంలో సూపర్ స్పెషాలిటి ఆస్పత్రి, జన్మభూమి రోడ్డు, చెరువు కట్ట రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, శిల్పారామం, పీటీసీ స్టేడియం, ఎన్టీఆర్ మ్యూజియం, కల్లూరు సుబ్బారావు మ్యూజియం, 12 ఓపెన్ జిమ్ములు, డ్వాక్రా మహిళలకు 32 కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేసిన ఘనత ప్రభాకర్ చౌదరికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్, సౌకత్ పాల్గొన్నారు.

సాయం అడిగితే .. పడుకుంటావా అంటున్నారు..!

- భానుకోటలో వితంతువు గౌతమి కన్నీటి కష్టం
- మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో ఆవేదన


మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో కంటతడి పెడుతున్న గౌతమి

ధర్మవరం రూరల్, జనవరి 22: 'కొవిడ్ సమయంలో నా భర్త చనిపోయారు. పిల్లలను ఎలా పెంచుకోవాలో తెలియక దుఃఖసాగరంలో ఉన్నాను. అలాంటి నన్ను వైసీపీ నాయకులు లైంగికంగా వేధిస్తున్నారు. ప్రభుత్వ పథకాలకోసం వెళితే నాతో పడుకుంటావా.. అని అడుగుతున్నారు..' అని మాజీ మంత్రి పరిటాల సునీత వద్ద ఓ మహిళ కంటతడి పెట్టుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో గౌతమి అనే వితంతువు గోడు వెల్లబోసుకున్నారు. బోయ సామాజికవర్గానికి చెందిన బాధితురాలు.. వైసీపీ సానుభూతిపరులు కావడం గమనార్హం. గ్రామస్థులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరైన ఆమె.. పరిటాల సునీత ఎదుట తన కష్టాన్ని చెప్పుకున్నారు. తన భర్త కుంపటి కుళ్లాయప్ప కొవిడ్ సమయంలో జ్వరంతో బాధపడుతుంటే.. చికిత్స చేయిస్తామని వైసీపీవారు హామీ ఇచ్చి, ఆ తరువాత పట్టించుకోలేదని తెలిపారు. చిన్నవయసులోనే భర్తను కోల్పోయి, ఇద్దరు పిల్లలతో పుట్టెడు దుఃఖంలో ఉన్నానని ఆమె అన్నారు. 'ఆయన చనిపోయాక రూ.2 లక్షలు.. రూ.5 లక్షలు ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నాకు అండగా ఉంటామని చెప్పారు. ఏ కష్టం వచ్చినా చెప్పాలన్నారు. వారి మాటలు నమ్మిన నాకు మూడేళ్లుగా నరకం చూపిస్తున్నారు. ఇప్పటివరకు పింఛన్ తప్ప ఏమీ రాలేదు. ఇంటి బిల్లులు పడలేదు. ప్రభుత్వ పథకాల కోసం వెళితే కాగితాలు తీసుకుని రమ్మంటారు. ఆ కాగితాలు కోసం రూ.5 వేలు ఖర్చు చేసి తీసుకుపోయాను. ఆ కాగితాలు చెల్లవని ఉద్దేశపూర్వకంగా తిప్పుకుంటున్నారు. కొందరు వ్యక్తులు నాతో వస్తావా, పండుకుంటావా అని అసభ్యకరంగా మాట్లాడుతున్నారు..' అని గౌతమి వేదికపై కన్నీటిపర్యంతమయ్యారు. తనపై బంధువులు దాడిచేస్తున్నా ఎవరూ రక్షణ కల్పించలేదని, కనగానపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్‌ఐ రాలేదు, ఇంకొక్కరు రాలేదని ఉద్దేశపూర్వకంగా రాత్రి 10 గంటల వరకు కూర్చోబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తనకు న్యాయం చేయలేదని, నేటికీ తనపై దాడులు కొనసాగుతున్నాయని వాపోయింది. 'ఏ కష్టం వచ్చినా మేమున్నామని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చెప్పారు. కానీ ఇప్పటివరకు మా గురించి పట్టించుకున్న పాపన పోలేదు. పరిటాల సునీతమ్మ గారే నన్ను, నా పిల్లలను కాపాడాలి' అని బాధితురాలు వేడుకున్నారు. ఆమె మాటలు విన్న పరిటాల సునీత తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. ఆమెను దగ్గరకు తీసుకుని అధైర్యపడవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.


రాయదుర్గం: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


డి.హీరేహాళ్‌లో రాముడి విగ్రహం ఊరేగింపు


బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని రామాలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణులు(టౌన్)


కూడేరులో ఊరేగింపుగా వెళ్తున్న సీతారాములు


గొందిపల్లిలో ప్రత్యేక అలంకరణలో సీతా రాములు(గుత్తిరూరల్)


గుత్తిలో ప్రత్యేక అలంకరణలో రాములవారు


తాడిపత్రిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం


కొనకొండ్లలో అలంకరణలో సీతారామలక్ష్మణులు


గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి


గుంతకల్లు మండలంలోని జి.కొట్టాలలో పూజలు అందుకున్న సీతారామలక్ష్మణులు


పామిడిలో శ్రీరాముని వేషధారణలో చిన్నారులు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు(విడపనకల్లు)

అంతా రామమయం !

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పలు ప్రాంతాల్లోని వైష్ణవాలయాల్లో సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ పరిసరాలు శ్రీ రామ నామస్మరణతో మార్మోగాయి. రామాలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు చేశారు. యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అయోధ్యలో జరుగుతున్న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను తిలకించేందుకు ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్‌లను కొన్ని ఆలయాల్లో ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద వడ, పప్పు, పానకం పంపిణీ చేశారు. మరికొన్ని ఆలయాల వద్ద అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీరాముడి చిత్రపటాన్ని ఆయా ప్రాంతాల్లో ఊరేగించారు.ఈ క్రమంలో ప్రతి ఊరూ అయోధ్యాపురిగా మారినట్లు అగుపించింది.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


ఎల్లుట్ల గ్రామంలో సీతారామచంద్రమూర్తి(పుట్లూరు)


రామరాజుపల్లిలో అలంకరణలో సీతారాములు(యాడికి)


అలంకరణలో సీతారామచంద్రమూర్తి(పెద్దపప్పూరు)


బెళుగుప్పలో కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తుల


కంబదూరులో శ్రీరాముడి విగ్రహంతో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో పట్టాభిరామస్వామి(కళ్యాణదుర్గం)


కళ్యాణదుర్గంలో సీతా స్వయంవరం నాటకాన్ని ప్రదర్శిస్తున్న బాలబాలికలు


కుందుర్పిలో ప్రత్యేకాలంకరణలో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు


ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపించిన దృశ్యం(బొమ్మనహాళ్)


ఆయతపల్లిలో శ్రీరాముని చిత్రపటం ఊరేగిస్తున్న గ్రామస్థులు


కణేకల్లులో శ్రీరాముడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

హెచ్‌ఎంపై జాయింట్ కలెక్టర్ ఆగ్రహం


హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేతన్‌గార్గ్

కూడేరు, జనవరి 22: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరా లేకపోవడంపై జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గొట్కూరు, కమ్మూరు, అరవకూరు, కూడేరు, జల్లిపల్లి, కొర్రకోడు, ఉదిరిపికొండ, మరుట్ల పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. కూడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదుల్లో కరెంట్ లేకపోవడంతో పాఠశాల హెచ్‌ఎంని ప్రశ్నించారు. దీంతో ఆమె నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కరెంట్ వేయకపోతే సస్పెండ్ చేస్తా అంటూ తీవ్రంగా హెచ్చరించారు. పాఠశాలలో నాడు- నేడు పథకం కింద కరెంటు పనులు చేయలేదా, ఇంత నిర్లక్ష్యం ఎందుకంటూ తక్షణం ఆమెపై చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. డీవైఈఓ శ్రీనివాసరావు వెంటనే పాఠశాలకు చేరుకొని తక్షణం నాడు- నేడు కింద కరెంట్ పనులు చేయాలని తీర్మానం చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు రెండోదశ పనులు వేగంగా చేయాలని డీవైఈఓ హెచ్‌ఎంను ఆదేశించారు.

రూ.10 లక్షలు స్వాధీనం

విడపనకల్లు, జనవరి 22: మండలంలోని హావళిగి చెక్‌పోస్టు వద్ద రూ. 10 లక్షల నగదును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం సెబ్ అడిషినల్ ఎస్పీ రామక్రిష్ణ, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప తెలిపిన మేరకు.. సోమవారం మధ్యాహ్నం హావళిగి సరిహద్దు చెక్ పోస్టు వద్ద పాల్తూరు ఎస్‌ఐ తిప్పయ్య, ఎక్సైజ్ చెక్‌పోస్టు ఎస్‌ఐ అంజనేయులు తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వీరికి ఓ ద్వి చక్రవాహనంలో రూ. 10లక్షలు తరలిస్తున్న వ్యక్తి కనిపించాడు. అతడిని ప్రశ్నించగా కర్ణాటకలోని బళ్లారి జిల్లా, చాగనూరు గ్రామానికి చెందిన చాకలి వీరభద్రప్ప అని తన వివరాలు తెలిపాడు. ఉండబండ గ్రామంలో జొన్న అమ్మిన రైతులకు డబ్బు చెల్లించేందుకు వెళ్తున్నట్లు రైతులు జొన్న పంటలు అమ్మిన వారికి చెల్లించేందుకు వెళ్తున్నట్లు తెలిపాడు. అయితే సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదు, ద్విక్రవాహనాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

రాయదుర్గం, జనవరి 22: న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పోరాడుతున్న అంగన్‌వాడీ వర్కర్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి పర్యటనను ఉరవకొండలో అడ్డుకుంటామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బీ మల్లికార్జున తెలిపారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలపైకి పోలీసులను ఉసిగొల్పి ప్రభుత్వం ప్రవర్తించిన తీరును ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు.

అరటిగెలలను పరిశీలించిన ఎమ్మెస్ రాజు

పుట్లూరు, జనవరి22: మండలంలోని కమ్మనమల గ్రామంలో టీడీపీ నాయకులు ఓబన్నకు చెందిన నరికివేసిన అరటిగెలలను సోమవారం టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతును పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నబిడ్డల్లా పెంచుకున్న అరటిగెలలను నరికివేయడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనకు పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుల తోటలను టార్గెట్ చేస్తూ నరికివేయడం జగన్‌రెడ్డి ప్రభుత్వ దుశ్చర్యలకు పరాకాష్ట అన్నారు. సుదర్శన్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, నాగేశ్వరరెడ్డి, రామానాయుడు, శ్రీనివాసరెడ్డి, రామాంజనేయులు, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రకటన

బాల ప్రసాద్ S/o బాల చెన్నకేశవులు (లేట్) D.No:9-5-668-1/1 కోతిగుట్ట, రాయదుర్గం, అనంతపురం జిల్లా Doc.No.5727/2021, సర్వేనెం.334ను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాయదుర్గం బ్రాంచ్ లో తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంత రాలు, తకరార్లు ఉన్న యెడల 7 రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి. హద్దులు :- తూర్పు: భాగ్యమ్మ గారి భూమి, పడమర :బాల అప్పి గారి భూమి, ఉత్తరం:రోడ్డు, దక్షిణం:రోడ్డు.

K.మల్లికార్జున, అడ్వకేట్, రాయదుర్గం

కులగణన పరిశీలన

యల్లనూరు, జనవరి22: మండలంలో జరుగుతున్న కుల గణన సర్వేను జిల్లా డీఎల్‌డీఓ ఓబులమ్మ సోమవారం పరిశీలించారు. బుక్కాపురం, బొప్పేపల్లి, చింతకాయమంద సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వే విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈఓఆర్‌డీ జయశేఖర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు భవిష్యత్తు

● మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్


రామగిరిలో మహిళలతో మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

పామిడి, జనవరి 22: తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు ఉజ్వల భవిష్యత్తు గ్యారెంటీ అని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. మండలంలోని రామగిరి గ్రామంలో సోమవారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీతోనే గ్యారెంటీ ఉందన్నారు. నారా చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా దూసుకువెళ్తుందన్నారు. టీడీపీలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ సీనియర్ నాయకులు బయన్నగారి నాగరాజును పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, మాజీ ఎంపీపీ రాయల్‌రామయ్య, తలారి మస్తానప్ప, సత్యనారాయణ, జయకుమార్, వడ్డే పెద్దఎర్రిస్వామి, వడ్డే ఆనంద్‌బాబు, శివశంకర్, రమేష్‌నాయక్, నల్లబోతుల శ్రీనివాసులు, వడ్డే సుదర్శన్‌బాబు, రామకృష్ణ, వడ్డే శివకుమార్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని భూస్థాపితం చేద్దాం: ఉమా


కరపత్రాలను అందజేస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, జనవరి 22: ప్రజాబలంతో వైసీపీని భూస్థాపితం చేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని పాతచెరువు గ్రామంలో సోమవారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేస్తూ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వైసీపీ పాలనలో సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. పల్లె ప్రాంతం నుంచి పట్టణాల వరకు అభివృద్ధి బాటలో నడవాలన్నా, భావితరాల భవిష్యత్తు బాగుపడాలంటే ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. అందుకోసం మనమందరం సమష్టిగా కృషి చేసి టీడీపీని అధికారంలోకి తెద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి తోడ్పాటు అందించండి : జేసీపీఆర్


బుర్నాకుంట గ్రామంలో పర్యటిస్తున్న జేసీపీఆర్

పెద్దవడుగూరు, జనవరి22: గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాల ని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బస్సుయాత్రలో భాగంగా సోమవారం మల్లేన్‌పల్లి, ముప్పాలగుత్తి, బుర్నా కుంట, బందార్లపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కేవలం టీడీపీతోనే సాధ్యమని వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మల్లేన్‌పల్లి గ్రామంలో అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు రాజు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, గంగాధర, ఫక్కీరప్ప, పవన్, చిదంబరయ్య ఉన్నారు.

సీతారామాంజనేయస్వామిని దర్శించుకున్న ఉమా

బ్రహ్మసముద్రం, జనవరి 22: మండలలోని పాల వెంకటాపురం గ్రామంలో కొలువైన సీతారామాంజనేయ స్వామిని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, డాక్టర్ రాంబాబు, సత్యప్ప, దొడఘట్ట నారాయణ, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలకు సమాధానం చెప్పి అడుగుపెట్టు

పామిడి, జనవరి 22: సీఎం జగన్‌రెడ్డి అంగన్‌వాడీలకు సమాధానం చెప్పి అనంతపురం జిల్లాలో అడుగు పెట్టాలని టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా మీరు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటూ సమ్మె చేయడం తప్పుకాదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు వినపడలేదా..? కనపడలేదా..? అని ప్రశ్నించారు. అంగన్‌వాడీలు 41వ రోజులు సమ్మె చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు.

సీతారాముల కల్యాణంలో పాల్గొన్న జేసీ అశ్మిత్‌రెడ్డి



తాడిపత్రి, జనవరి22: పట్టణంలోని మెయిన్‌బజారులో సోమవారం జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి హాజరైన జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు జరిపారు.

కసాపురం ఆలయంలో వేడుకలు


అలంకారంలో ఆంజనేయస్వామి మూల విరాట్టు

గుంతకల్లు, జనవరి22: అయోధ్యలో బాల రాముడు కొలువవుతున్న వేళ కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆల యంలో స్వామివార్లకు ఘనంగా అభిషేకాలు, పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ స్థానంలో సోమవారం ఉదయం నెట్టికంటి స్వామి వారి మూల విరాట్టుకు అభిషేకాలు చేసి, వజ్ర కవచ, కిరీట, దుస్తుల అలంకారాలు చేశారు. ఆల యంలో సీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి తిరుమంజన స్నపనం, అభిషేకాలు చేసి సర్వాంగ సుందరంగా అలంకారాలు చేశారు. సాయంత్రం స్వామివారిని గరుడ విహనంపై ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు.

వైభవంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ

రాయదుర్గం, జనవరి 22: పట్టణంలోని టవర్‌క్లాక్ ఆవరణలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు నాయకుల బండి క్రిష్టప్ప సోమవారం మహర్షి విగ్రహం ప్రతిష్ఠించారు. ముందుగా అర్చకులు ప్రసన్న గణపతి పూజ నిర్వహించి మంత్రోచ్చారణ తదితర పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠ గావించారు. సేవా సమితి కార్యదర్శి సిద్ధప్ప, ఉపాధ్యక్షులు మలకన్న, ఉప కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి నాయకుల బండి చంద్రశేఖర్, ఉప కోశాధికారి పైతోట రఘు, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే సంక్షేమం: వైయూ


కరపత్రం అందజేస్తున్న రామాంజనేయులు

పామిడి, జనవరి 22: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని ఏడో వార్డు మాజీ కౌన్సిలర్ వైయూ రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని 7, 8వ వార్డులలో సోమవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రతి ఇంటింటికీ వెళ్లి వైసీపీ అక్రమాలు, అవినీతి, ఆగడాలు, అరాచకాలను వివరించారు. టీడీపీ ప్రవేశపెట్టనున్న సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు బొమ్మా మోహన్‌కృష్ణ, యుగంధర్, సూరి, మాధవ, మోదిన్, దూదు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి

గుత్తి, జనవరి 22: అంగన్‌వాడీ వర్కర్లను మానసికంగా వేధిస్తున్న సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అస్వస్థతకు గురై గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ వర్కర్లను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీడీపీఓ వేధింపుల వల్లే కొంత మంది అంగన్‌వాడీ వర్కర్లకు షుగరు, బీపీ వంటి జబ్బులు వచ్చాయన్నారు. సీడీపీఓను బదిలీ చేయాలని, ఆమె పద్ధతి మార్చుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, మల్లేష్, మల్లికార్జున, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట నిరసన

కణేకల్లు, జనవరి 22: మండలంలోని మాల్యం గ్రామంలో గత కొన్ని రోజులుగా సక్రమంగా నీరు రాకపోవడంతో గ్రామస్థులు ఖాళీ బిందెలతో సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. సచివాలయ ఏరియాలో ప్రజలకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకానికి సంబంధించిన నీటితో పాటు స్థానిక బోరుబావి నీళ్ల ప్రధాన వనరులుగా ఉన్నాయి. కానీ ఇటీవల శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మె చేస్తుండడంతో కాలనీవాసులకు నీరు అందని పరిస్థితి నెలకొంది. అంతే కాక బోరుబావి కూడా మరమ్మతులకు గురి కావడంతో కాలనీవాసులు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. దీంతో ఇన్‌చార్జ్ సెక్రెటరీ తిమ్మప్ప స్పందించి వెంటనే చేతిపంపును మరమ్మతు చేసి నీటిని అందిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతుడు సురేష్ (ఫైల్)

పెద్దవడుగూరు, జనవరి 22: మండలంలోని గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సురేష్ (28) మృతి చెందాడు. పెద్దవడుగూరుకి చెందిన సురేష్, శ్రీకాంత్ తమ వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం ద్విచక్ర వాహనంపై గుత్తికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. అటుగా వెళ్తున్న ప్రజలు గమనించి క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సురేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

